క్లుప్తంగా

మంత్రి హరీశ్‌రావును కలిసిన 'పల్లా'



దేవరుప్పుల : రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును బీఆర్‌ఎస్ పార్టీ మండల సమన్వయకర్త పల్లా సుందర్‌రామిరెడ్డి హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి దయాకర్‌రావు వెంట వెళ్లిన సుందర్‌రామిరెడ్డికి మంత్రి హరీశ్‌రావు సూచనలు చేశారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు పాటుపడాలని చెప్పారు.

ఖర్గే జన్మదిన వేడుకలు

జనగామ రూరల్ : ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య నియోజకవర్గ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాసాన్‌పల్లి లింగాజీ, ఓబీసీ అధ్యక్షుడు లోకుట్ల ప్రవీణ్, జిల్లా నాయకులు కట్ట కృష్ణ, జాఫర్, శ్రీనివాస్, మధు, రామకృష్ణ, గిరి, పరశురాములు పాల్గొన్నారు.

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో పారాయణం



జనగామ : పట్టణంలోని నగరేశ్వర శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయంలో అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం శ్రీ సంపూర్ణ కృష్ణ యజుర్వేద పారాయణం నిర్వహించారు. రెండ్రోజులుగా జరుగుతున్న వేడుకలు నేటితో ముగియనున్నాయి. కలశ స్థాపన, రుద్రచండీ హోమాలు, మహా పూర్ణాహుతి, అన్నదానం, తదుపరి కార్యక్రమాలతో ముగుస్తాయి. పారాయణంలో ప్రధాన అర్చకులు యల్లంబట్ల ప్రసాద్‌శర్మ, యల్లంబట్ల రాఘవశర్మ, రేవూరి సాయి విశ్వేశ్వరశర్మ, వెల్డి రాకేష్‌శర్మ, కొడకండ్ల రోహిత్ శర్మ, అవ్వారు ప్రసాద్, త్రిపురనేని ఈశ్వర్, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

చండిక అమ్మవారికి పంచామృతాభిషేకం

పాలకుర్తి టౌన్ : మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ చండికా దేవికి శ్రీ సూక్త విదానేన పంచామృత అభిషేకం నిర్వహించారు. పట్టువస్త్రాలతో, సుగంధ ద్రవ్యాలతో విశేష అలంకరణ చేశారు. శ్రీలలితా సహస్రనామ పారాయణం, నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ బి.లక్ష్మీప్రసన్న, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని ఇప్పగూడెం పీహెచ్‌సీ పరిధిలోని కోమటిగూడెం వెల్‌నెస్ సెంటర్‌లో, బోయినిగూడెం గ్రామంలో డాక్టర్ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. పలువురి నుంచి రక్త నమూనాలు సేకరించారు. బీపీ, షుగర్ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అజయ్‌కుమార్ మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గూడెల్లి అశోక్, ఉపసర్పంచ్ ఆంజనేయులు, హెల్త్ సూపర్‌వైజర్ సత్యం, ఏఎన్‌ఎంలు రాజ్యలక్ష్మీ, రేఖ, కార్యదర్శి సంతోష్, ల్యాబ్ టెక్నీషియన్ మహేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బచ్చన్నపేట : మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన నడిమింటి శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా అతడితో కలిసి 2002లో పదో తరగతి చదువుకున్న స్నేహితులు బాధిత కుటుంబానికి శుక్రవారం రూ.10 వేలు సాయం అందించారు. తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో వేముల లక్ష్మణ్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, ధనంజయ్, రవి, కుమార్, రమేష్, ఆంజనేయులు, రాములు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో..

దేవరుప్పుల : మండలంలోని గొల్లపల్లికి చెందిన బొండ్ల ముత్తయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ నాయకుడు ఏల సోమసుందర్ శుక్రవారం రూ.5 వేల సాయం అందించారు. తొలుత సంతాపం తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కోనేటి సుభాషిణి నర్సయ్య, బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తీగల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ఆకవరం నర్సింహారెడ్డి, పద్మశాలి సంఘం నాయకులు ఆంకాల సోమనారాయణ, బిట్ల వేణు పాల్గొన్నారు.

జనజీవనం అతలాకుతలం

కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లావ్యాప్తంగా జనజీవనం అతలాకుతలమైంది. పలు చెరువులు మత్తడి పోస్తున్నాయి. పూరిళ్లు, పెంకుటిళ్లు కూలిపోయాయి. అధికారులు చెరువుల వద్ద రక్షణ చర్యలు చేపట్టారు. ఇళ్ల ఎదుటే నీరు నిలిచిన దుస్థితి నెలకొంది. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

–సాక్షి నెట్‌వర్క్



దేవరుప్పల : మత్తడి పోస్తున్న చెక్‌డ్యామ్



జనగామ రూరల్ : వెంకిర్యాలలో కాల్వకు పడిన భారీ గండి



తరిగొప్పల : అక్కరాజుపల్లి గ్రామంలో కూలిపోయిన పెంకుటిల్లు



రఘునాథపల్లి : మండలగూడెం వద్ద కాజ్‌వే పక్కన తెగిన రోడ్డు

బ్రిడ్జి సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తా

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్య

రఘునాథపల్లి : మండలంలోని మండలగూడెం వాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తెలిపారు. మండలంలోని మండలగూడెం, మేకలగట్టు, మాదారం, ఇబ్రహీంపూర్‌ల్లో పొంగిపొర్లుతున్న వాగులను శుక్రవారం ఆయన సందర్శించారు. మండలగూడెం వాగు వద్ద కాజ్‌వే పక్కన రోడ్డు కోతకు గురై రాకపోకలు నిలిచిపోగా డీఈ శ్రీనివాస్‌ను పిలిచి హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ శ్రీనివాస్, సర్పంచ్‌లు పోకల శివకుమార్, ఉత్తెపు ఉమారాణి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మండలగూడెం వాగు వద్ద కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద 52 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే రాజయ్య కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు శివకుమార్, తహసీల్దార్ అన్వర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.కుమార్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బుచ్చయ్య, సర్పంచ్‌లు తూముకుంట్ల సురేందర్ రెడ్డి, హయత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లకు తాత్కలిక మరమ్మతులు

జఫర్‌గఢ్ : వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు వెంటనే తాత్కలిక మరమ్మతులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే రాజయ్య తెలిపారు. మండలంలోని వడ్డెగూడెంలో పాతూరుకు వెళ్లే రహదారి కోతకు గురికాగా అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. సూరారంలో కోతకు గురైన బీటీ రోడ్డును పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్, జెడ్పీటీసీ బేబి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు అంకితభావంతో పని చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్ : వైద్యులు అంకితభావంతో పని చేయాలని ఎమ్మెల్యే రాజయ్య కోరారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరిన వైద్యులు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ సుగుణాకర్‌రాజు ఆధ్వర్యంలో రాజయ్యను క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యులు ఏ.శ్రీకాంత్, పి.రజని, టి.సుమన్ కుమార్, ఎస్.శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్‌కు సన్మానం

స్టేషన్‌ఘన్‌పూర్ : లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ ఎస్.వెంకటేశ్వర్‌రావును స్థానిక క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. తొలుత అమెరికాకు వెళ్లి వస్తున్న సందర్భంగా ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఘన్‌పూర్ క్లబ్ దత్తత తీసుకున్న ఇందిరానగర్‌లో 14 మంది వృద్ధులు, వితంతువులకు చీరెలు పంపిణీ చేశారు. అనంతరం క్లబ్ జిల్లా గవర్నర్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడారు. స్టేషన్‌ఘన్‌పూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు యువాన్ జాన్, కార్యదర్శి ఆమంచ నిర్మల, కోశాధికారి మంజులరెడ్డి, జోన్ చైర్మన్ ఆమంచ మధుసూదన్, కేసీ.జాన్ బన్నీ, కరుణాకర్‌రెడ్డి, వీటీ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



క్లబ్ జిల్లా గవర్నర్‌ను సన్మానిస్తున్న బాధ్యులు

ఘనస్వాగతం

రఘునాథపల్లి : అమెరికాలోని బోస్టన్‌లో లయన్స్ గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా ఎస్.వెంకటేశ్వర్‌రావుకు స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం బస్టాండ్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయం వద్ద లయన్స్ గవర్నర్ ప్రత్యేక పూజలు చేసి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను శాలువాలతో సత్కరించారు. అనంతరం గవర్నర్ వెంకటేశ్వరరావు మాట్లాడారు. సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పూర్వ జోన్ చైర్మన్ గంద్ర శ్రీకాంత్, రీజియన్ చైర్మన్ రాపాక విజయ్, క్లబ్ అధ్యక్షుడు పి.శంకర్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రదీప్‌కుమార్, శంకరయ్య, లక్ష్మణ్, రవి, కుమార్, అనిల్‌కుమార్, రాజు, శ్రీనివాస్, కృష్ణకుమార్, మునిరాజ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలి

బచ్చన్నపేట : మండల ప్రజలు ఇంటి ఆవరణలో ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఇంకుడుగుంతల నిర్మాణానికి ముగ్గు పోయించారు. పల్లె ప్రగతి పనులను, నర్సరీలను సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో అందరూ మొక్కలు నాటాలని సూచించారు. వన నర్సరీలోని మొక్కలను రైతుల పొలం గట్లపైనా. ప్రభుత్వ స్థలాల్లో నాటించాలని చెప్పారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీళ్లు పట్టాలని, చుట్టూ ముళ్ల కంచెలను ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో టీఏ కరుణాకర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాడుతాం

కొడకండ్ల : విద్యారంగ సమస్యలపై పోరాడుతామని ఎస్ఎస్‌యూఐ పాలకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు దేశగాని హరగోపాల్‌గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం ఆయన సందర్శించి సమస్యలపై అధ్యయనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్ ఇవ్వడం లేదన్నారు. టాయిలెట్స్ శుభ్రంగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే వార్డెన్ స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు వంశీగౌడ్, కోల నరేష్‌గౌడ్, వీరదాస్ వినయ్, సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ



జనగామ రూరల్ : మండలంలోని పసరమడ్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ గ్రేటర్ ఆధ్వర్యంలో జిల్లా గవర్నర్ వెంకటేశ్వర్‌రావు చేతుల మీదుగా శుక్రవారం స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. అనంతరం వెంకటేశ్వర్‌రావు మొక్కలు నాటారు. కార్యక్రమానికి హెచ్‌ఎం దివాకర్‌రెడ్డి అధ్యక్షత వహించగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు రామకృష్ణ, శ్రీకాంత్, రాజాబోస్, ఏఎంసీ చైర్‌పర్సన్ రేణుక, ఎఫ్ఏ ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



జనగామ రూరల్ : బతుకమ్మ ఆడుతూ నిరసన తెలుపుతున్న కార్మికులు



తరిగొప్పల : వర్షంలోనే సమ్మెను కొనసాగిస్తున్న జీపీ కార్మికులు

జనగామ రూరల్/రఘునాథపల్లి/స్టేషన్ ఘన్‌పూర్/చిల్పూరు/తరిగొప్పల/బచ్చన్న పేట/కొడకండ్ల : గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె జిల్లావ్యాప్తంగా కొనసాగుతోంది. జనగామ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జీపీ మహిళా కార్మికులు బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. రఘునాథపల్లిలో సమ్మెకు ఎంపీపీ మేకల వరలక్ష్మీ సంఘీభావం తెలిపి మాట్లాడారు. పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో కార్మికులు చెవిలో పువ్వుతో నిరసన తెలిపారు. తరిగొప్పులలో వర్షంలోనూ కార్మికులు సమ్మె కొనసాగించారు. చిల్పూరులో జీపీ కార్మికుల సమ్మెకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎన్నకూస కుమార్ మద్దతు తెలిపి రూ.2 వేలు సాయం అందించారు.



బచ్చన్నపేట : చెవిలో పువ్వుతో నిరసన తెలుపుతున్న కార్మికులు

మణిపూర్ సీఎం రాజీనామా చేయాలి

జనగామ : మణిపూర్ ఘటనకు అక్కడి సీఎం బాధ్యత వహించి రాజీనామా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయం నుంచి నెహ్రూ పార్క్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం కనకారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు ఇర్రి అహల్య, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

జనగామ రూరల్ : ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వంశీ, వెంకన్న, రాజు, పవన్, మాయ, రేఖ, నళిని తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని సమాధానం చెప్పాలి



జనగామ: నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్ : మణిపూర్ అల్లర్లు, మహిళలను నగ్నంగా ఊరేగించడం, అత్యాచార ఘటనలపై కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర డిమాండ్ చేశారు. డివిజన్ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. మణిపూర్ ఘటనలను ఖండించారు. మణిపూర్‌లో శాంతిభద్రతల పరిరక్షణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

స్టేషన్‌ఘన్‌పూర్ : నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పూల్‌సింగ్ చౌహాన్ కోరారు. వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక తహసీల్ కార్యాలయంలో ఇరిగేషన్, పంచాయతీరాజ్, మండల పరిషత్, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, పోలీస్ తదితర శాఖల అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువులు, కుంటలు నిండి ప్రమాదకరంగా ఉంటే ముందస్తుగా ప్రజలకు హెచ్చరికలు చేయాలని చెప్పారు. కల్వర్టులు, రోడ్లు కోతలకు గురికాక ముందే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను ఖాళీ చేయించాలని, నష్టాల నివారణకు బాధ్యతగా పనిచేయాలని చెప్పారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ పూల్‌సింగ్ చౌహాన్

సీహెచ్‌సీలో మెరుగైన వైద్యసేవలు

బచ్చన్నపేట : మండల కేంద్రంలోని క్లస్టర్ హెల్త్ సెంటర్‌లో మెరుగైన వైద్యసేవలు అందుతాయని సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాకాలంలో పలు రకాల జబ్బులు సోకే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. ఆస్పత్రి అప్‌గ్రేడ్ అయిన క్రమంలో గైనకాలజిస్ట్, డెర్మటాలజిస్ట్, పేడియాట్రిస్ట్, అనెస్థెటిస్ట్, ఫిజియోథెరపిస్ట్ కొత్తగా నియామకమై విధుల్లో చేరినట్లు తెలిపారు. ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించాలని ఏఎన్ఎంలకు, ఆశావర్కర్లకు సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సిద్ధార్థరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పోరాట ఫలితంగానే వైద్యనిపుణుల నియామకం

జఫర్‌గఢ్ : సీపీఎం పోరాట ఫలితంగానే జఫర్‌గఢ్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వం వైద్యనిపుణులను నియమించిందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యనిపుణులను నియమించాలని డిమాండ్ చేస్తూ పార్టీ ఆధ్వర్యంలో ఇటీవల ధర్నా చేసినట్టు తెలిపారు. ఆస్పత్రిలో గైనకాలిజిస్ట్, జనరల్ ఫిజిషియన్, అనెస్తీషియా, పేడియాట్రిక్, జనరల్ సర్జన్ అందుబాటులో ఉంటారని చెప్పారు. సమావేశంలో నాయకులు యాతం సమ్మయ్య, కాట సుధాకర్, డీవైఎఫ్ఐ నాయకుడు కాట శ్రీను పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ



తనిఖీ నిర్వహిస్తున్న డీఆర్‌డీఓ రాంరెడ్డి

లింగాలఘణపురం : ఈజీఎస్ పనులపై మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సురేందర్ అధ్యక్షతన 14వ విడత సామాజిక తనిఖీ శుక్రవారం నిర్వహించారు. డీఆర్‌డీఓ రాంరెడ్డి పాల్గొని పర్యవేక్షించారు. 2020 నుంచి 2023 మార్చి వరకు జరిగిన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో 1645 పనులు చేపట్టగా రూ.11,68,00,328 చెల్లించగా అందులో కూలీలకు రూ.9,21,48,978లు, మెటీరియల్‌కు రూ.2,46,51,350లు చెల్లించారు.

సంక్షిప్త సమాచారం

జీజేహెచ్‌పీఎస్ యూత్ వర్కింగ్ అధ్యక్షుడిగా మధు

పాలకుర్తి : మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన కూనూరు మధును గౌడ జన హక్కుల పోరాట సమితి (జీజేహెచ్‌పీఎస్) మోకుదెబ్బ యూత్ (యువజన విభాగం) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాష్ట్ర అధ్యక్షుడు రాగుల కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడారు. తన నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షుడు అమరవేని నర్సాగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోశాల వెంకన్న, జిల్లా అధ్యక్షుడు గుండెబోయిన ఉప్పలయ్య, నాయకులు నలమాస రమేష్, కమ్మగాని వెంకన్న, పులి భాస్కర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

యూత్ అధ్యక్షుడిగా కొన్నె సురేష్



నర్మెట : తెలంగాణ రాష్ట్ర కుమ్మర్ల సంఘం యూత్ మండల అధ్యక్షుడుగా కొన్నె సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల శాఖ అధ్యక్షుడు కొన్నె రాజు శుక్రవారం తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆకారపు మోహన్ సూచనలతో రాష్ట్ర కన్వీనర్ ఏనుగుతల యాదగిరి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సురేష్‌ను శుక్రవారం ఎన్నుకున్నారు. అనంతరం సురేష్‌కు ఎన్నిక పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్యదర్శి రాయారపు ఉపేందర్, జిల్లా కన్వీనర్ రాయారపు నాగరాజు, నియోజకవర్గ కన్వీనర్ నాంపెల్లి అశోక్, హన్మంతాపూర్ శాఖ అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు అండాళ్ దేవీ తిరునక్షత్రం

చిల్పూరు : మండల కేంద్రంలోని బుగులు వెంకటేశ్వరస్వామి ఆలయంలో నేడు (శనివారం) ఉదయం 7 నుంచి 11 గంటల వరకు అండాళ్ తిరునక్షత్రం మహోత్సవం నిర్వహిస్తున్నందున భక్తులు సమయానుకూలంగా హాజరు కావాలని ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు కోరారు. ఆలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ అమ్మవారికి పంచామృతాలతో చందనం కార్యక్రమాలుంటాయని తెలిపారు. మధ్యాహ్నం 11 గంటలకు స్వామి వారి వారకల్యాణం నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

జనగామ రూరల్ : మూడ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం విద్యాసంస్థలకు, పాఠశాలలకు రెండ్రోజులు సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. వర్షాలు తగ్గుముఖం పట్టకపోవడంతో నేడు (శనివారం) కూడా విద్యాసంస్థల సెలవు కొనసాగుతుందని డీఈఓ కె.రాము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు బ్రాహ్మణ శంఖారావం



జనగామ : రేపు (ఆదివారం) హుజురాబాద్‌లో బ్రాహ్మణ శంఖారావం కార్యక్రమం నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, అర్చక ఉద్యోగ కార్యాచరణ జిల్లా అధ్యక్షుడు బెలిగిని మఠం శివకుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని శ్రీ దుర్గామాత ఆలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్ఏబీసీ గ్రాంట్ ఇన్ ఎయిడ్ పొందుతున్న అర్చకులతోపాటు ధూపదీప నైవేద్య అర్చకులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. శంఖారావానికి బ్రాహ్మణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. తొలుత ఉపేంద్రశర్మను అర్చకులు సత్కరించారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

కొడకండ్ల : ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు కలిగిన ఐదెకరాల్లోపు భూములున్న చిన్న, సన్నకారు రైతులు పండ్ల తోటల పెంపకం కోసం ఈనెల 31 వరకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ పరావస్తు శేషాద్రిసూరి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మామిడి, నిమ్మ, నారింజ, జీడిమామిడి, జామ, సీతాఫలం, సపోట, అయిల్‌పామ్, నేరేడు, ఆపిల్‌బేర్, దానిమ్మ, మునగ, డ్రాగన్‌ఫ్రూట్, కొబ్బరి తోటల సాగుకు అరుత్హులు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శికి, ఫీల్డ్ అసిస్టెంట్లకు లేదా మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

హైదరాబాద్‌కు వెళ్లిన బీజేపీ శ్రేణులు

నర్మెట : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా మండల శాఖ అధ్యక్షుడు ధరావత్ రాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో శుక్రవారం హైదరాబాద్ వెళ్లారు. వెళ్లిన వారిలో జిల్లా, మండల నాయకులు జంగిటి నాగేశ్వర్, పోలు రాజు, శ్రీనివాస్, అవినాష్, అరవింద్, మధు, చెవుల రాజు, రాజబోయిన జహంగీర్, ఆకోజు అంజనేయులు, కిరణ్, నరేష్, చెల్లం శంకర్, కొన్నె రాజు, కరుణాకర్, కుమార్ తదితరులున్నారు.

27న సర్వసభ్య సమావేశం

కొడకండ్ల : ఈనెల 27న ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పరావస్తు శేషాద్రిసూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ జ్యోతి అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. మండలంలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ప్రభుత్వ అధికారులు హాజరు కావాలని కోరారు.

వర్గీకరణ బిల్లు పెట్టాలి

బచ్చన్నపేట : ప్రస్తుత పార్లమెంటరీ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సన్నాహక సభకు బచ్చన్నపేట నుంచి నాయకులు అల్వాల నర్సింగరావు, మల్లేష్, స్వామి, రాజేష్, శ్రీకాంత్, చిరంజీవి, ఇస్తారి, రాజు, అంజయ్య, అనిల్, శ్రీనివాస్, పరశురాములు తదితరులు వెళ్లారు.